అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన విమానం

యానాం: పుదుచ్చేరి నుంచి బెంగుళూరు వెళ్లాల్సిన ఇండిగో 6ఇ 7143 నంబరు గల విమానాన్ని సోమవారం సాంకేతిక లోపం కారణంగా రద్దు చేశారు. రన్‌వే వద్దకు చేరుకుంటున్న సమయంలో సాంకేతిక లోపం కారణంగా విమానం నిలిచిపోయింది. అనంతరం ప్రయాణికులను హుటాహుటిన దింపివేశారు. అందులో పుదుచ్చేరి బీజేపీ నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి విచ్చేసిన ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్, బీజేపీ పుదుచ్చేరి ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ సురేనా, పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు తదితరులు ప్రయాణిస్తున్నారు. అనంతరం విమానాన్ని పార్కింగ్ ప్రాంతానికి తరలించారు.

పెన్షన్ నిబంధనల సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన

అమలాపురం రూరల్: పెన్షన్ నిబంధనల సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోనసీమ జిల్లా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద విశ్రాంత ఉద్యోగులు నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరాజు, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీ నాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపి కలెక్టరేట్‌కు వినతి పత్రం అందించారు. ఈ చట్టం వల్ల పాత పెన్షనర్లకు నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కాశీ వెంకట్రావు, భాస్కరం, గంగధరరావు, పీవీవీ కృష్ణంరాజు, నరసింహవర్మ పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో పచ్చధనం

- మంచి ఫలితాలిస్తున్న సాగు
- రైతుకు అదనపు ఆదాయం
- ఎకరాకు 20 టన్నుల పశుగ్రాసం
- బహుళ ప్రయోజనాలతో ఆనందం



పచ్చిరొట్ట సాగు చేసిన పొలం

పాడి-పంట

పిఠాపురం: అవగాహన ఉంటే సాగులో సిరుల పంటే... కాలానుగుణంగా పంటలు వేస్తే అదనపు ఆదాయమే.. ఒకప్పుడు పచ్చిరొట్ట పంట అంటే ఏముందిలే అనుకునే వారు, ఇప్పుడు అదే అదనపు ఆదాయం తెచ్చే వనరు అయ్యింది. ఏటా రబీ పంట తర్వాత మండు వేసవిలో పొలాలను ఖాళీగా ఉంచే వారు. కానీ ప్రకృతి వ్యవసాయం పెరగడంతో ఎక్కడ చూసినా మండుటెండల్లో కూడా పచ్చని పంట పొలాలు కనిపిస్తున్నాయి. వేసవిలోనూ రైతులకు అదనపు ఆదాయం తెచ్చేలా, పశువులకు మేతగా, భూమికి పోషకాలు అందించే పచ్చిరొట్ట సాగుపై అవగాహన పెరిగింది. బహుళ ప్రయోజనాలు కలిగిన ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్)- పచ్చిరొట్ట పంటలు సాగు చేసిన రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఏటా రబీ పూర్తయిన తర్వాత మే నెల 15 నుంచి జూన్ 30 లోపు ఈ పంటను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ పంట కాలం 45 రోజులు. ఈ ఏడాది పిఠాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో సుమారు 400 ఎకరాల్లో పచ్చిరొట్ట చేశారు. దీని కోసం ఎకరానికి 10 కిలోల చొప్పున ప్రకృతి వ్యవసాయ శాఖ రైతులకు నవధాన్యాల విత్తనాలను అందించింది. ఇటీవల దీనిని రైతులు సాగు చేశారు. మొత్తం 400 ఎకరాల్లో పీఎండీఎస్ విత్తనాలు మరింత సారవంతంగా మొక్కలు రావడంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతోంది.

అమ్మకం... ఆదాయం

పచ్చిరొట్ట పంట ఏపుగా పెరగడంతో రైతుకు అదనపు ఆదాయం సమకూరుతోంది. పంట బాగా రావడంతో ఎకరానికి సుమారు 20 టన్నుల వరకూ పోషక విలువ ఉన్న పశుగ్రాసం లభ్యమైంది. ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ రైతుకు అదనపు ఆదాయం సమకూరుతోంది. వివిధ మిల్క్ డెయిరీలకు చెందిన యజమానులు పచ్చిరొట్ట పశుగ్రాసం కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇలా రోజూ 200 టన్నులకు పైగా పశుగ్రాసం అమ్మకాలు జరుగుతున్నాయి. ఒకపక్క భూమి సారవంతం కావడంతో పాటు మరోపక్క రైతుకు అదనపు ఆదాయం వస్తుండడంతో పచ్చిరొట్ట సాగుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

సాగు.. లాభాలు బాగు

పచ్చిరొట్ట సాగు చేసిన పంట పొలాల్లో అనూహ్య ఫలితాలు కనిపిస్తున్నాయి. భూసారం పెరగడంతో పాటు రైతుకు మంచి లాభాలను తెచ్చిపెడుతోంది. వీటి సాగుతో కలుపు నివారణ జరుగుతుంది. భూసారం పెరుగుతుంది, భూమి గుల్లబారి నీటి నిల్వ సామర్థ్యం అధికమవుతుంది. పురుగులు, తెగుళ్ల నివారణ, రైతు మిత్రులు వానపాముల వృద్ధి జరిగి మిత్ర పురుగుల శాతం పెరుగుతుంది. ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గి ఖర్చు ఆదా అవుతుంది. భూమి కోతకు గురి కాకుండా కాపాడుతూ పంట దిగుబడి బాగుంటుంది. భూతాపం తగ్గి విపత్తులను తట్టుకునే శక్తి వస్తుంది. నేల సేంద్రియ కర్బనం రెండు శాతం వరకూ పెరిగి సూక్ష్మజీవుల వైవిధ్యత పెరిగి అనేక పోషకాలు పైరుకు అందుతాయి. బీడు భూములు సారవంతమవుతాయి. వేసవిలో పశువులకు గ్రాసం అందుతుంది. పంట వేరు వ్యవస్థ పటిష్ఠంగా పెరిగి, పంట వాతావరణ ఆటుపోట్లను తట్టుకుని నిలబడుతుంది. జీవవైవిధ్యం పెరుగుతుంది. పంట ఉత్పత్తుల నాణ్యత, పోషక విలువలు పెరిగి రైతుకు అదనపు ఆదాయం తెచ్చిపెడుతుంది. 365 రోజులు భూమి కప్పబడి ఉండి సకాల వర్షాలకు దోహదపడుతుంది. ఈ గ్రాసం తీసుకున్న పశువుల్లో పాల దిగుబడి పెరుగుతుంది. పాలలో వెన్న శాతం అధికమవుతుంది. ఈ విధంగా ఇప్పటికే ఫలితాలు సాధించిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పంట వివరాలు

పచ్చిరొట్ట సాగు భూములు: 40 వేల ఎకరాలు
పంపిణీ చేసిన విత్తనాలు: 400 టన్నులు
సాగు చేసిన రైతులు: 56 వేల మంది
దిగుబడికి వచ్చిన పశుగ్రాసం: 60 వేల టన్నులు
వచ్చిన ఆదాయం: సుమారు రూ.6 కోట్లు

మత్తులో చెలరేగిపోయారు!

- యువకుల పరస్పర దాడులు
- జాతరలో అశ్లీల నృత్యాలు
- పెద్దాపురం పట్టణంలో ఘటన



మద్యం మత్తులో ఘర్షణ పడుతున్న యువకులు

పెద్దాపురం: మద్యం, గంజాయి మత్తులో చెలరేగిపోయారు.. రోడ్లపై ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.. కూటమి ప్రభుత్వంలో కొందరి అండతో ఈ తంతు యథేచ్ఛగా సాగిందనడానికి ఆదివారం అర్ధరాత్రి పెద్దాపురం పట్టణంలో జరిగిన ఘటనే నిదర్శనం. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఎంతో భక్తిభావంతో పెద్దాపురం మరిడమ్మ వారి ఆషాఢమాస ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వీధి సంబరాలు జరుగుతుండడం ఆనవాయితీ వస్తోంది. ఇందులో భాగంగా తొలి ఆదివారం స్థానిక దర్గా సెంటర్ చేపల వీధి సంబరం జరిగింది. ఇక్కడ యువతులతో అశ్లీల నృత్యాలు చేయించారు. ఇది పోలీసుల ముందే జరగడం విశేషం. డీజే పేరిట డ్యాన్సులతో హోరెత్తించారు. ఇదిలా ఉంటే ఇక్కడ మద్యం, గంజాయి తాగిన కొందరు యువకులు పరస్పర దాడులకు దిగి భయంకర వాతావరణాన్ని సృష్టించారు. ఆ యువకులు సుమారు మూడు చోట్ల స్టేజీ సమీపంలోనే ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. విచక్షణా రహితంగా కొట్టుకోవడంతో పోలీసులు వారిని నిలువరించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ మౌనిక, తన సిబ్బంది వచ్చి వారిని తరిమేయడంతో యువత చెల్లాచెదురయ్యారు. తర్వాత ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్న చోటే మళ్లీ రక్తం చిందేలా కొట్టుకున్నారు. పరస్పర దాడులకు దిగారు. ఈ ఘటనల్లో సుమారు 15 మందికి గాయాలు కాగా, మూడు ఘటనలకు సంబంధించి ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అశ్లీల నృత్యాల నిర్వహణకు స్థానిక కూటమి నేతల ఒత్తిళ్లే కారణమని, అందుకే పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎటువంటి కేసూ నమోదు కాకపోవడం గమనార్హం.

మద్యం మత్తులోనే ఘర్షణ

స్థానిక చేపల వీధి సంబరంలో తగదా పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. సోమవారం రాత్రి ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. సంబరాన్ని తిలకించేందుకు వచ్చిన ఇరువురు యువకుల మధ్య జరిగిన వాగ్వాదం చినికి చినికి గాలివానలా మారి ఘర్షణ చోటుచేసుకుందన్నారు. ఇరువురూ మద్యం మత్తులో ఉన్నారని, సోషల్ మీడియాలో వాటిని వక్రీకరిస్తూ గంజాయి మత్తు అంటూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. ఆ వార్తల్లో వాస్తవం లేదని, కేవలం మద్యం మత్తులో మాత్రమే ఆ యువకులు తీవ్రంగా గాయపర్చుకున్నారన్నారు. పెద్దాపురానికి చెందిన బాలుడు, రాజమహేంద్రవరం సీతంపేట ఎన్టీఆర్ కాలనీకి చెందిన చుక్కా దుర్గారావును అదుపులోకి తీసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వీధి సంబరాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పట్టణంలో గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో సీఐ విజయశంకర్, ఎస్‌ఐ మౌనిక పాల్గొన్నారు.

పూడిక తీత.. ఎవరికి మేత ?

- వర్షాలు కురుస్తున్నప్పుడు డ్రెయిన్లలో పూడికతీత
- నామినేషన్ల విధానంలో కాంట్రాక్టర్లకు పనుల అప్పగింత
- రూ.30 లక్షల నిధులు వర్షార్పణమేనా ?



అమలాపురంలో సోమవారం కొనసాగుతున్న డ్రెయిన్లలో పూడిక తీత పనులు

అమలాపురం టౌన్: ఎండ కాస్తున్నప్పుడు మున్సిపాలిటీ పరిధిలోని డ్రెయిన్లలో పూడిక తీత పనులపై నిర్లక్ష్యం వహించి ప్రస్తుతం వర్షాలు కురుస్తుండగా చేపట్టడంపై పట్టణ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమలాపురం మున్సిపాలిటీకి డ్రెయిన్లలో పూడికతీత పనులకు రూ.30 లక్షలు నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియకు తావులేకుండా రూ.5 లక్షల చొప్పున నామినేషన్ల విధానంలో కొంతమంది కాంట్రాక్టర్లు పూడిక తీత పనులు చేపట్టారు. రూ.30 లక్షల విలువైన పనుల్లో కాంట్రాక్టర్ల వెనుక కొంత మంది కౌన్సిలర్లు, అధికారుల పాత్ర కూడా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సమస్య యథాతథం

డ్రెయిన్లలోంచి సిల్ట్‌ను బయటకు తీసి అదే డ్రెయిన్ పక్కనే పోస్తున్నారు. రెండు రోజుల తర్వాత ఆ సిల్ట్ తడి ఆరిన తర్వాత వేరే చోటకు తరలించాలని కాంట్రాక్టు నిబంధనల్లో ఉంది. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత సమయంలో డ్రెయిన్లలో పూడిక మట్టిని తీసి బయటపోసినప్పటికీ వర్షం నీటి ప్రవాహానికి ఆ మట్టి జారి మళ్లీ అదే డ్రెయిన్‌లోకి జారి పూడిక సమస్య యథాతథమవుతోంది.

అనువుకాని సమయంలో పూడికతీత

అమలాపురం పట్టణం కుంకాల సందులో సోమవారం వర్షం కురుస్తున్నా డ్రెయిన్‌లో పూడికతీత పనులు మొదలు పెట్టేశారు. ఇలాగైతే పూడిక తీత పనులకు కేటాయించిన రూ.30 లక్షలు నిధులు వర్షార్పణం అవుతుందని ప్రజలు అంటున్నారు. పట్టణంలోని 30 వార్డుల్లో కొన్నిచోట్ల పూడిక తీత పనులు అరకొరగానే జరిగాయి. తీసిన పూడిక మట్టిని సకాలంతో తొలగించకపోవడంతో ఆ మట్టి వర్షాలకు, గాలులకు మళ్లీ డ్రెయిన్‌లోకి చేరుతోంది. పూడిక తీత పనులు అనువైన సమయంలో చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రహ శకలం భూమిని ఢీకొడితే పెను ప్రమాదం

కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సర్వేశ్వరశర్మ



కోనసీమ సైన్స్ పరిషత్ మహాసభలో మాట్లాడుతున్న అధ్యక్షుడు డాక్టర్ సర్వేశ్వరశర్మ

అమలాపురం టౌన్: గ్రహ శకలాలు భూమిని ఢీకొడితే వాతావరణంలో దుమ్ము, పొగ పెరిగిపోయే పెను ప్రమాదం ఉందని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. దుమ్ము, పొగ కారణంగా సూర్యరశ్మి చేరక ఉష్ణోగ్రత తగ్గి ఆయా ప్రాంతాల మానవాళి అవస్థలు పడుతుందని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా స్కూల్లో సోమవారం నిర్వహించిన కోనసీమ సైన్స్ పరిషత్ 2919వ మహాసభలో డాక్టర్ సర్వేశ్వరశర్మ మాట్లాడారు. గ్రహ శకలాలు సూర్యుని చుట్టూ తిరిగే రాతి శిలలని ఆయన స్పష్టం చేశారు. ఈ శకలాల పరిమాణం గులకరాయి పరిమాణం నుంచి 960 కిలోమీటర్ల వెడల్పు వరకూ కలిగి ఉంటాయన్నారు. 1908 జూన్ 30న ఒక పెద్ద గ్రహ శకలం భూ వాతావరణంలోకి దూసుకు వచ్చి సైబీరియా మీదుగా ఆకాశంలో పేలిపోయిన విషయాన్ని డాక్టర్ శర్మ గుర్తు చేశారు. ఈ ఘటనకు గుర్తుగా 2016లో ఐక్య రాజ్య సమితి జూన్ 30 అంతర్జాతీయ గ్రహ శకలాల దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. గ్రహ శకలాలు భూవాతావరణంలోకి ప్రవేశించగానే బూడిదగా మారిపోతాయని చెప్పారు. గ్రహాలు వాటి పని తీరును విద్యార్థినులకు వివరించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు శిష్ట నాగవల్లి, విశ్రాంత హెచ్ఎం బీఆర్ కామేశ్వరరావు ప్రసంగించారు.

ఏఎస్సైల సేవలు అభినందనీయం



ఏఎస్సై దంపతులను సత్కరిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు, సీఐలు, ఎస్సైలు

అమలాపురం టౌన్: పోలీస్ శాఖలో దాదాపు 35 ఏళ్లకు పైగా సేవలు అందించిన ఆ ఇద్దరి ఏఎస్సైల సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు.రామచంద్రపురం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైలుగా పనిచేస్తున్న కె.నాగార్జునరావు, బి.మల్లికార్జునరావు వీడ్కోలు సభ సోమవారం స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సభకు ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ఏఎస్సైల సేవలను కొనియాడారు. ఏఎస్సైలను వారి కుటుంబాల సమక్షంలో జిల్లా పోలీస్ శాఖ తరఫున ఎస్పీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రామచంద్రపురం సీఐ పి.వెంకటనారాయణ, ఎస్సై నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాసరావు తదితరులు కూడా ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్సైలను సత్కరించి వీడ్కోలు పలికారు.

ధాన్యం సొమ్ము అందజేయాలి

అమలాపురం రూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం విక్రయించి రెండు నెలలైనా ఇప్పటికీ బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ కాలేదని రైతులు, కౌలుదారులు అమలాపురం కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. రైతులు సార్వా సాగు చేయాలంటే ధాన్యం డబ్బులు వెంటనే ఇవ్వాలని కోరారు. ఉప్పలగుప్తం మండలం నంగవరం సర్పంచ్ జున్నూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులు జేసీ నిషాంతికి వినతిపత్రం అందించారు జిల్లా వ్యాప్తంగా రైతులకు రూ.255 కోట్లు ధాన్యం సొమ్ము ప్రభుత్వం జమ చేయవలసి ఉందని ఆయన అన్నారు. రైతులు ఎం. బాబి, శీలం సూరిబాబు తదితరలు పాల్గొన్నారు.

ముంపు సమస్య పరిష్కరించకుంటే సాగు చేయలేం

అల్లవరం: ప్రధాన డ్రెయిన్లో అనధికార వలకట్లు ఏర్పాటుతో లోయర్ కౌశిక పరిధిలోని గ్రామాల్లో ఏటా ముంపు తప్పడం లేదని, దీంతో ఖరీఫ్ సాగు కష్టమవుతోందని అల్లవరం మండలంలో అల్లవరం, రెల్లుగడ్డ, ఎంట్రుకోన గ్రామాలకు చెందిన రైతులు కలెక్టర్‌ని సోమవారం కలసి మొరపెట్టుకున్నారు. చేపల కోసం వలకట్లకు బరకాలు ఏర్పాటు చేస్తున్నారని, తద్వారా నీటి ప్రవాహం తగ్గి ముంపు నీరు స్తంభించి 30 ఏళ్లుగా వేలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా చెరువుల నుంచి వ్యర్థ జలాలను డ్రెయిన్‌లోకి మోటార్ల సహాయంతో తోడేస్తున్నారని తెలిపారు. ఎస్.రామేశ్వరంలో ముంపు నీరు దిగే మొగ ఆక్రమణలకు గురై వేలాది ఎకరాలు ముంపు బారిన పడుతున్నాయని తెలిపారు. మేజర్ డ్రెయిన్లో తూడు, గుర్రపు డెక్కని తొలగించాలని కోరారు. మే 10 తర్వాత ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్ము జమ చేయాలని కోరారు. రైతులు బుద్ధరాజు పెదబాబు, బొక్కా శ్రీను, కుడుపూడి నాగేశ్వరరావు, కాశే సత్యనారాయణ, మేడిద శంకరం, కొనుకు బాపూజీ తదితరులు పాల్గొపారు.

లక్ష్మణరావు సేవలు చిరస్మరణీయం

యానాం: యానాం వ్యవసాయ మార్కెట్ కమిటీ పూర్వపు చైర్మన్ యర్రా లక్ష్మణరావు సేవలు చిరస్మరణీయమైనవని ప్రముఖ పారిశ్రామికవేత్త రీజెన్సీ సంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆయన లక్ష్మణరావు మృతికి సంతాపం తెలిపారు. యర్రా గార్డెన్స్‌లో లక్ష్మణరావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఈలప్రోలు విష్ణువర్ధనరావు, గౌరీశంకర్ పాల్గొన్నారు. యానాం బైపాస్ రహదారిలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని, యానాం పారిశ్రామిక రంగానికి విశేష సేవలు అందించిన దివంగత లెఫ్టినెంట్ గవర్నర్ కోన ప్రభాకరరావు విగ్రహాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు జీఎన్ నాయుడు తెలిపారు.

నిస్వార్థ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

యానాం: ఉద్యోగులు నిస్వార్థ సేవలను అందించడం ద్వారా ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని రిటైర్డ్ ఆర్ఏఓ నామాడి అప్పారావు పేర్కొన్నారు. సోమవారం యానాం మార్కెట్ కమిటీలో సూపర్‌వైజర్‌గా, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ లైసెన్స్‌డ్ ప్రిమిసెస్ మార్కెట్ కమిటీగా 41 ఏళ్లపాటు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ప్రముఖ నాటక కళాకారుడు జక్కపు సత్తిబాబును సహచర ఉద్యోగులు, అధికారులు స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ చిక్కాల జోగిరాజు, హంసాని రామ లక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' సమావేశం

ఐ.పోలవరం: అంబేడ్కర్ కోనసీమ వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన జూలై 2న అమలాపురం మండలం ఇందుపల్లిలో ఏ వన్ కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ ఐ.పోలవరం మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. ఐ పోలవరం మండలం పార్టీ నాయకులకు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తరలిరావాలన్నారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి

అమలాపురం రూరల్: బస్సు స్టేషన్ల పరిధిలోని దుకాణాల్లో ప్రయాణికులకు కనిపించే విధంగా ధరల పట్టికను ఏర్పాటు చేయాలని జిల్లాలోని అన్ని డిపోల్లో అధికారులను ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎస్‌టీపీ రాఘవ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే ఎంఆర్‌పీకి మించకుండా విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి


విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించి అగ్రస్థానంలో ఉంచారని, కూటమి ప్రభుత్వం కూడా విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. అల్లవరం హైస్కూల్లో హెచ్‌ఎం ఎస్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కానుకలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులకు విద్యా కానుకలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, పీఎంసీ చైర్మన్ చేట్ల అరుణ, బండిగుప్తాపు పాండురంగ, అడపా కృష్ణ, బొక్కా ప్రసాదు, సుంకర సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులకు అవగాహన

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.బలరాం ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు విపత్తులు, ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీఎస్ దివాకర్, ఎంఈవో సత్తి సత్య కృష్ణ, హెచ్‌ఎం జి.కనకదుర్గ పాల్గొన్నారు.

ఘనంగా రమణయ్య జయంతి

యానాం: ఫ్రెంచివారి నుంచి యానాం ప్రాంతాన్ని విముక్తి చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు దడాల రమణయ్య (రఫేల్) జయంతిని సోమవారం సమాచార శాఖ ఆధర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిపానాలధికారి కార్యాలయం ఎదుట ఉన్న దడాల రమణయ్య కాంస్య విగ్రహానికి ఇన్‌ఛార్జి ఆర్ఏఓ భాస్కరరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ట్రైనీ ఐఏఎస్ అఖిల్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫ్రెంచివారిపై జరిపిన స్వాతంత్ర్య పోరాటంలో రమణయ్య కీలకపాత్ర వహించారని, తుపాకులకు ఎదురొడ్డి ధైర్యంగా పోరాడాలని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్సై నూకరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మాస్టారి సేవలు ప్రశంసనీయం


ప్రధానోపాధ్యాయుడు పీవీ శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న నాయకులు

తాళ్లరేవు: పి.మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పాలెపు వెంకటశ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయమని పలువురు కొనియాడారు. శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయుడు మొండి వీరబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరావు దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సుమారు 39 ఏళ్లపాటు జిల్లాల్లో వివిధ పాఠశాలల్లో విశేష సేవలందించి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంపన రామకృష్ణ, వైస్ ఎంపీపీ డి.నాగేంద్రప్రసాద్, ఎంఈఓ మోకా ఉమ, నాయకులు దున్నా జనార్ధనరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని మహిళల ధర్నా

అమలాపురం రూరల్: అల్లవరం మండలం బెండమూర్లంక పిల్లకాలువ గట్టుకు రోడ్డు నిర్మించాలని కోరుతూ అమలాపురం కలెక్టరేట్ ఎదుట సోమవారం మహిళలు ధర్నా చేశారు. కలెక్టర్ పీజీఆర్ఎస్‌లో రోడ్డు కోసం ఫిర్యాదు చేశామన్నారు. మట్టి రోడ్డుపై ప్రయాణానికి విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సూర్య నగేష్, ఎర్రేతురాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిగా రామలింగం ప్రమాణ స్వీకారం

యానాం: పుదుచ్చేరి బీజేపీ నూతన అధ్యక్షుడిగా మాజీ నామినేటెడ్ ఎమెల్యే వీపీ రామలింగం సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పుదుచ్చేరిలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ నుంచి రామలింగం నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం రామలింగంను పలువురు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి నమశ్శివాయం, రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్, ఇన్‌ఛార్జి నిర్మల్‌కుమార్‌సురేనా, ఎమ్మెల్యే జాన్‌కుమార్ పాల్గొన్నారు.

ఒక్కరి కోసం అందరూ ఒక్కటై..

- బండారులంక ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన చిరుద్యోగికి ఘన సత్కారం
- రూ.10 లక్షల ఆర్థికసాయం చెక్కు అందించిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు


నరసింహ దంపతులను సత్కరించి ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన చిరు ఉద్యోగిని సోమవారం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రూ.10 లక్షలు పైగా సేకరించి దీనికి సంబంధించిన నగదు చెక్కులను ఆయనకు అందించారు. యనమదల నరసింహారావు బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 43 ఏళ్లుగా స్వీపర్ కం వాటర్ బాయ్‌గా ఉద్యోగం చేస్తూ లక్షలాది మందికి తలలో నాలుకగా నిలిచారు. సోమవారం ఆయన పదవీ విరమణ పొందారు. ఆయనకు పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, గ్రామస్తుల సమక్షంలో హెచ్‌ఎం వెంకటలక్ష్మి బాల అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పర్మినెంట్ కాకపోవడంతో ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం ఉంచి ఏవిధమైన ఆర్థిక ప్రయోజనాలు పొందలేని ఆ చిరుద్యోగికి వారంతా అండగా నిలిచారు. 1982లో పాఠశాలలో నరసింహారావు రూ.75 వేతనంతో ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం కంటింజెంట్ ఉద్యోగిగా రూ.20 వేల జీతం పొందుతున్నారు. పూర్వ విద్యార్థుల పేరిట వాట్సాప్ గ్రూపును రూపొందించి సామాజిక మాధ్యమాల ద్వారా పోస్టింగులు పెట్టి బ్యాచ్‌ల వారీగా నగదు సేకరించారు. సోమవారం అదే పాఠశాలలో వేలాది మంది పూర్వపు విద్యార్థుల సమక్షంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. రూ.10 లక్షలకుపైబడి సేకరించిన మొత్తాన్ని నరసింహం దంపతులు పేరిట బ్యాంకులో డిపాజిట్ చేసి ప్రతినెల వడ్డీని తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. సేకరించిన సొమ్ము చెక్కుల రూపంలో సన్మాన సభలో నరసింహ దంపతులకు పూర్వ విద్యార్థులు అందజేశారు.

ఆధ్యాత్మిక చింతనతో శాంతియుత జీవనం

ఉప్పలగుప్తం: ఆధ్యాత్మిక చింతనతో శాంతియుత జీవనం సాగించవచ్చని అమలాపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.శ్రీరేఖ అన్నారు. విలసవిల్లి రామమందిరంలో అర్చకులు ముష్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో వారాహి అమ్మవారి నవరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న పూజల్లో ఐదవ రోజు సోమవారం శ్రీరేఖ పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఈ సందర్భంగా జడ్జిని అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, భక్తులు పాల్గొన్నారు.

దళితులపై దాడులకు నిరసన


అమలాపురంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న జిల్లా దళిత ఐక్య వేదిక ప్రతినిధులు

అమలాపురం టౌన్: పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం అరవల్లిలో మాలలపై జరిగిన దమనకాండకు ఆందోళన వ్యక్తం చేస్తూ జిల్లా దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో సోమవారం నిరసన ప్రదర్శన జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్ మాట్లాడుతూ అరవల్లి ఘటనకు కూటమి ప్రభుత్వం, పోలీసుల వైఫల్యమే కారణమని ఆరోపించారు. ఈ ఘటనకు కారణమైన ప్రధాన వ్యక్తి ముమ్మిడివరపు ప్రతాప్ (న్యాయవాది) కూటమి ప్రభుత్వానికి చెందిన వాడని గుర్తు చేశారు. అక్కడి పోలీసు అధికారులే కూటమి ప్రభుత్వంలోని పెద్దల సిఫార్సులతో కేసును నీరుగార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అరవల్లి ఘటనకు బాధ్యులైన నిందితులను అరెస్ట్ చేసి వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో జిల్లా ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబూరావు, వేదిక ప్రతినిధులు రామ్ బోధి కాశి, ములపర్తి సత్యనారాయణ, సాపే బాలరవి, గెడ్డం సురేష్‌బాబు, జంగా రాజేంద్ర, కాశి వెంకట్రావు పాల్గొన్నారు.

ఉపాధిలో దొంగ మస్తర్ల నమోదుపై ఫిర్యాదు

అల్లవరం: రెల్లుగడ్డలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ముమ్మిడివరపు వెంకటరామారావు, మేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బొంతు వెంకటరమణమ్మ ఇరువులు కలసి దొంగ మస్తర్లు నమోదు చేసి అవినీతికి పాల్పడుతున్నారని ఎలువుల్లంక ప్రాంతానికి చెందిన బొంతు ఫణీంద్ర, దుర్గాకృష్ణకుమార్ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. రెండు నెలలుగా 20 మంది ఉపాధి కూలీలకు పలు పనుల్లో దొంగ మస్తర్లు నమోదు చేస్తూ, ఫేక్ ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంత కాలంగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నా ఉపాధి అధికారులు పట్టించుకోవడం లేదు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌పై విచారణ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.



వైద్యులు.. కనిపించే దేవుళ్లు

అమలాపురం టౌన్: వైద్యో నారాయణో హరి అంటారు. ప్రాణం పోసేవాడు దేవుడు అయితే ఆ ప్రాణాన్ని నిలిపేవారు వైద్యులు. నేటికీ వైద్య వృత్తికి సమాజంలో ఎంతో ప్రాధాన్యత ఉంది. వైద్యులను దేవునితో సమానంగా రోగులు కొలుస్తున్నారంటే నేటికీ వైద్య వృత్తి పట్ల వారికున్న గౌరవం, విలువను చాటుతోంది. ప్రజలు వైద్యులకు మర్యాద, గౌరవం ఇస్తున్నారంటే ఆ వృత్తికి ఉన్న గొప్పతనం అలాంటిది. మంగళవారం డాక్టర్స్ దినోత్సవ కావడంతో ప్రజలు వైద్య సేవలను, వైద్యులను గుర్తుకు తెచ్చుకుంటున్నారు. కోనసీమ జిల్లా ప్రజలు మెరుగైన వైద్యం కోసం గతంలో రాజమహేంద్రవరం, కాకినాడ, లేదా హైదరాబాద్‌కు పరుగులు పెట్టేవారు. ఇప్పుడు జిల్లా కేంద్రం అమలాపురంలో అన్ని వసతులతో కూడిన అత్యాధునిక వైద్యశాలలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా రోగ నిర్ధారణలో కీలకమైన స్కానింగ్‌లు, ఎంఆర్ఐ, ల్యాబ్ పరీక్షలు అమలాపురంలోని ఆస్పత్రుల్లో సిద్ధంగా ఉంటున్నాయి. ఈ ప్రాంత వాసులకు ఏదైనా రోగమొస్తే సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండానే వైద్యం ఇక్కడే అందుబాటులో ఉండే వెసులబాటు లభించించినందుకు వైద్య పరంగా వారికి భరోసా ఉంటోంది.

తాళ్లరేవులో ట్రాఫిక్‌ను నియంత్రించాలి

తాళ్లరేవు: ప్రధాన రహదారిలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణా చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదికలో టి.ఈశ్వరరావు, డి.అదృష్టదీపుడు తదితరులు ఫిర్యాదు చేసారు. ప్రధానంగా తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్, సంతపేట సెంటర్, దేవీమహల్, గుడ్డివాని తూము సెంటర్లలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విపరీతమైన ట్రాఫిక్ ఉంటోందని, ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వ్యాపార దుకాణాల ఎదుట, రహదారిపైనే వాహనాలు నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. పశువులు రహదారిపై సంచరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణా చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలోని పలు పంచాయతీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను నియంత్రించాలని, పూర్తిస్థాయిలో సురక్షితమైన తాగునీటిని అందించాలని వారు కోరారు.

2న జెడ్పీ స్థాయి సంఘ సమావేశం

అమలాపురం రూరల్: జూలై రెండో తేదీ బుధవారం జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సర్వసభ్య సమావేశానికి ప్రతి జిల్లా అధికారి పూర్తి సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అధికారులతో ఆయన సమావేశమై సర్వసభ్య సమావేశం నిర్వహణపై సమీక్షించారు.